
పూజలు చేస్తున్న అర్చకుడు


దర్శనానికి బారులుతీరిన భక్తులు

## కొనసాగుతున్న బుగులోని జాతర

రేగొండ, నవంబర్ 17 : బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర మూడోరోజూ భక్త జన సందోహంతో పరవశించిపోయింది. తిరుమలగిరి శివారు గుట్టలపై ఏటా కార్తిక పౌర్ణమి మొదలుకొని ఐదు రోజులపాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ జాతర సోమవారంతో ముగియనుంది. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు నెరవేరిన వారు స్వామివారికి ఏనుగు, గుర్రం ప్రభ బండ్లను మొక్కులుగా సమర్పించారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రెంటాల వెంకటస్వామి, ఈవో బిల్ల శ్రీనివాస్ పర్యవేక్షించగా, రేగొండ ఎస్సై సందీప్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 'పుట్ట మధు హత్యకు కాంగ్రెస్ నాయకుల కుట్ర'

మల్హర్, నవంబర్ 17 : మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును హత్య చేసేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్ర చేస్తున్నారని, ఆయనకు ఎలాంటి హాని తలపెట్టినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు హత్యా రాజకీయాలకు పాల్పడడం మంచిది కాదని, గతం నుంచి తనకు కాంగ్రెస్ నాయకుల నుంచి ప్రాణ హానీ ఉందని, తనను హత్య చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని స్వయంగా పుట్ట మధు చెప్పినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పైగా గన్‌మెన్లను తొలగించి హత్యను ప్రోత్సహిస్తున్నట్టు వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఆయనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు వాలా యాదగిరిరావు, ఎడ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ తోట రాజేశ్వరరావు, నాయకులు అక్కినవేని సుమన్, పంతకాని వెంకటరాజ్, వేల్పుల శేఖర్, తోకల సమ్మయ్య, పిలమరి నరేశ్, పంతకాని సురేశ్, మద్దెల లక్ష్మణ్, ఇండ్ల శివ సారయ్య, స్వామి పాల్గొన్నారు.

## చల్లా నారాయణరెడ్డిపై కేసు నమోదు

మహాదేవపూర్/కాటారం, నవంబర్ 17: బీజేపీ నాయకుడు, కాటారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ చల్లా నారాయణరెడ్డిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వారి సోదరుడు దుద్దిళ్ల శ్రీను బాబుపై సోషల్ మీడియాలో నారాయణరెడ్డి ఆధారం లేని ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. పుట్ట మధును చంపమని, మంత్రి ప్రోత్సహించారని రెచ్చగొట్టేలా మాట్లాడాడని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆపరోపణలు చేసిన చల్లా నారాయణరెడ్డిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఎస్సైని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ వామన్‌రావు, మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, సమ్మయ్య పాల్గొన్నారు. కాగా, మంత్రి శ్రీధర్ బాబుపై నిరాధార ఆరోపణలు చేసిన చల్లా నారాయణరెడ్డిపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. మంత్రిపై నారాయణరెడ్డి అసత్యపు ఆరోపణలు చేసి, ఆయన పరువుకు భంగం కలిగేలా మాట్లాడారని పేర్కొన్నారు.

## వధూవరులకు మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆశీర్వాదం


కృష్ణకాలనీ : వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణ కాలనీ/చిట్యాల, నవంబర్ 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ముండ్రాతి రఘుపతి, వసంత దంపతుల కుమారుడు కార్తికేయన్, లక్ష్మి వివాహంతోపాటు భూపాలపల్లి మండలం శ్యామ్ నగర్ గ్రామానికి చెందిన దగ్గు సుమతి, సంపత్‌రావు దంపతుల కుమార్తె నవ్య, శ్రీనిష్ రావు వివాహ వేడుకల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, కౌన్సిలర్ జక్కం రవి కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, నాయకులు సేగ్గెం సిద్ధు, గడ్డం కుమార్‌రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, గండ్ర యువసేన నాయకులు శ్రీకాంత్ పటేల్, సాయి, శ్రీరామ్ ఉన్నారు. అలాగే, చిట్యాల మండల కేంద్రానికి చెందిన చేరి రవీందర్ కుమారుడు ప్రణయ్–శ్రావణి వివాహానికి గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై వారిని ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు టౌటం నవీన్, మాజీ సర్పంచ్ మహేందర్, మాజీ ఎంపీటీసీ పిట్ట సురేశ్, సీనియర్ నాయకులు పాండ్రాల వీరస్వామి, ఏరుకొండ రాజేందర్, పెరుమాండ్ల రవీందర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED TELECALLERS
★URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVESJOB LOCATION: HANAMKONDA, CONT: +91 9398286149.
NTW-7705

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-AII

RENT
★3 floors building for rent, each floor has 3600sqft Ground floor for parking place available, opp:ASM DEGREE & PG WOMENS COLLEGE,Fort Road Warangal M: 9849987808/8309884828.
NTW-17373

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# ముగిసిన మొదటి రోజు పరీక్షలు

- ప్రశాంతంగా గ్రూప్-3 ఎగ్జామ్స్
- పలు సెంటర్లను పరిశీలించిన అధికారులు
- ఆలస్యమై ఇద్దరు.. వేరే సెంటర్‌కు వెళ్లి ఒకరు పరీక్షకు దూరం
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో 54 శాతం హాజరు


భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 17: గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంఘ మిత్ర కళాశాలలో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, విద్యార్థులకు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు సూచించారు. జిల్లాలో గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు 17 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 3707 అభ్యర్థులకు గాను ఉదయం నిర్వహించిన పరీక్షకు 2023 మంది, సాయంత్రం జరిగిన పరీక్షలకు 2020 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మంగిలాల్, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు, పరీక్షా కేంద్రాల సీఎస్‌లు పాల్గొన్నారు.

**అనుమతించని పోలీసులు**

గణపురం : గణపురం మండలంలో ఐదు సెంటర్లలో గ్రూపు–3 పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఓఎస్‌డీ బోనాల కిషన్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ మల్లేశ్, ఎస్సై రేఖ అశోక్ పరిశీలించారు. గణపురం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇద్దరు మహిళా అభ్యర్థులు పరీక్షకు ఆలస్యంగా రావడంతో పోలీసులు అనుమతించలేదు. ఎంత బతిమిలాడినా ఫలితం లేకపోవడంతో పరీక్ష కేంద్రం నుంచి వారు వెనక్కి వెళ్లిపోయారు. అలాగే, మండల కేంద్రంలో ఒక విద్యార్థిని మోడల్ పాఠశాలకు బదులు జడ్పీహెచ్ఎస్‌కు వెళ్లడంతో సమయం అయిపోయి పరీక్షకు దూరమైంది.

**ములుగు జిల్లాలో 54.39 శాతం..**

ములుగు (నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లాలో జరిగిన గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 9 సెంటర్లలో 2173 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా 1182 మంది పరీక్ష రాయడంతో 54.39 హాజరు శాతం నమోదైంది. బండారుపల్లి మోడల్ స్కూల్‌లో 103 మంది, బిట్స్ స్కూల్‌లో 64మంది, సాధన స్కూల్‌లో 94మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 159మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 107 మంది, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 110 మంది, జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో 211మంది, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 78మంది, బ్రిలియంట్ స్కూల్‌లో 65 మంది గైర్హాజరయ్యారు. కాగా, ఉదయం నిర్వహించిన పరీక్షకు 1183 మంది అభ్యర్థులు హాజరయ్యారు.


రూట్ మ్యాప్ బోర్డును ప్రారంభిస్తున్న డీఎం

## గ్రూప్-3 పరీక్షలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

కృష్ణకాలనీ : గ్రూప్–3 పరీక్షలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు భూపాలపల్లి డిపో మేనేజర్ ఆమంచ ఇందు తెలిపారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రూట్ మ్యాప్ బోర్డును డీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ –3 పరీక్షలకు 17 సెంటర్లు ఏర్పాటు చేయగా, 3,707 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నందున వారికి రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ డిపో నుండి అన్ని సెంటర్లలోని ఏరియాలకు బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా ఉన్న బస్ స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని, ప్రధాన కూడళ్లలో వలంటరీలను కూడా నియమించినట్లు తెలిపారు.


గణపురం : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు, సిబ్బంది


ములుగు : ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

## విద్యుదాఘాతంతో రైతు మృతి


పెద్ద సమ్మయ్య(ఫైల్)

ములుగురూరల్, నవంబర్ 17: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన ములుగు మండలంలోని జగ్గన్నగూడెంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొట్టెం పెద్ద సమ్మయ్య తన పంట పొలంలో నీరు కట్టేందుకు వెళ్లి కరెంట్ తీగలను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులతో పాటు విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు గుండెబోయిన రవి గౌడ్, దబ్బగట్ల శోభన్ డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు..

గోవిందరావుపేట, నవంబర్17 : మండలంలోని పస్రా ప్రభుత్వ దవాఖాన వద్ద ఆదివారం కారు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పస్రా ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. బుద్దారపు వెంకటేశ్వర్లు(55) తన ఇంటి నుంచి ప్రభుత్వ దవాఖానకు బైక్‌పై వస్తూ రోడ్డు దాటేందుకు యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 ద్వారా ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## 10 లీటర్ల గుడుంబా పట్టివేత

మహాదేవపూర్, నవంబర్ 17 : అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పవన్ కుమార్ కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన నూనవత్ రాజశేఖర్, రాళ్ల బండి లక్ష్మణ్ గుడుంబాను తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. దీంతో సదరు వ్యక్తుల వద్ద 10 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు రామన్నగూడెం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుడు

ములుగురూరల్, నవంబర్17 : జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌కు ఏటూరునాగారం మండలం రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో పాణిని ఆదివారం తెలిపారు. డిసెంబర్ 16 నుంచి 21 వరకు హర్యానలో నిర్వహించే జాతీయ స్థాయి సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు రక్షితతో పాటు మైథిలీ పాల్గొంటారని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు శ్యాంసుందర్‌రెడ్డి పర్యవేక్షణలో వీరు తయారు చేసిన ఇంటలిజెంట్ ఆల్కహాల్ డిటెక్షన్ వెహికిల్ అలర్ట్ సిస్టమ్ ఫర్ డ్రైవర్స్ అనే ఎగ్జిబిట్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ములుగురూరల్, నవంబర్17 : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సమ్మక్క, సీనియర్ అసిస్టెంట్ నాగేందర్, నిఖిల్, రాకేశ్ పాల్గొన్నారు.

## డేటా నమోదులో జాగ్రత్తలు పాటించాలి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 17 : కుటుంబ, కులగణన సర్వే డేటా నమోదులో జాగ్రత్తలు పాటించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని సుభాష్ కాలనీలో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయాలన్నారు. డేటా నమోదులో అన్ని జాగ్రత్తలు పాటించాలని, సమాచార సేకరణ ఫారాలను పకడ్బందీగా భద్రపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సర్వే నోడల్ అధికారి సిద్దార్థ పాల్గొన్నారు.

**గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే**

మహాదేవపూర్/కాటారం : గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. మహాదేవపూర్ మండలంలో ఆదివారం ఎన్యుమరేటర్లు వివరాలను సేకరించారు. మండలంలో ఇప్పటి వరకు 95 శాతం సర్వే పూర్తి చేశామని, మూడు రోజుల్లో మొత్తం పూర్తి చేస్తామని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు దామోదర్ రెడ్డి, అంజలిరెడ్డి, మహేశ్, రమేశ్, కల్పన, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే, కాటారం మండలంలో 12,191 కుటుంబాలకు గాను 8,993 కుటుంబాల సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. సర్వే తీరును ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షించారు.

## అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి


అభివాదం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ములుగురూరల్, నవంబర్17 : విప్లవ విద్యార్థి అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు, పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి ముంజాల భిక్షపతిగౌడ్ అన్నారు. ఆదివారం ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 వసంతాల సందర్భంగా విప్లవ విద్యార్థుల అమరవీరుల యాది సభను నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ దవాఖాన నుంచి డీఎల్ఆర్ గార్డెన్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గతంలో ఎన్నో పోరాటాలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వంతో పోరాటంలో భాగంగా దారులు వేరైనా గమ్యం ఒక్కటే అనే నినాదంతో అనేక మంది విద్యార్థి సంఘం నాయకులు అమరులయ్యారని, 50 వసంతాల సందర్భంగా వారందరిని గుర్తు చేసుకునేందుకు యాది సభను నిర్వహించినట్లు భిక్షపతి గౌడ్ పేర్కొన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి నాయకురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, కేయూ ప్రొఫెసర్లు ఈసం నారాయణ, వెంకటనారాయణ, దనసరి సూర్య, సమ్మయ్య, నర్సయ్య, తీగల జీవన్, ఓదేలు, అప్పారావు, రవి, వెంకట్‌రెడ్డి, నర్సింహ, మధు, నాగరాజు, శ్రీనివాస్, కలకోటి మహేందర్, చాపర్తి కుమార్‌గాగ్గె, సురేశ్, సమ్మయ్య, నవీన్, రఫీ, శంకర్ పాల్గొన్నారు.

## రోడ్డు వేయకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

- ఆమరణ నిరాహార దీక్షకూ రెడీ
- ఐలాపూర్ గ్రామస్తుల హెచ్చరిక


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య

కన్నాయిగూడెం, నవంబర్ 17 : మండలంలోని ఐలాపూర్ గిరిజన గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను బహిష్కరించి పది రోజులు దాటినా ఒక్క అధికారి కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి మీడియాతో మాట్లాడారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే వరకూ పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామన్నారు. కలెక్టర్, ఐటీడీఏ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎన్నికలప్పుడు నాయకులు గ్రామానికి వచ్చి సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చి, గద్దెనెక్కిన తర్వాత మరిచిపోయారని విమర్శించారు. కుల సర్వే బహిష్కరించి పది రోజులు దాటినా ఒక అధికారి, ప్రజాప్రతినిధి స్పందించకపోవడం సరికాదన్నారు. బిర్సా ముండా, కొమురం భీమ్ స్ఫూర్తి, సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులతో ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామానికి రోడ్డు వేసే వరకూ ఆమరణ నిరాహార దీక్షలు చేస్తూ ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, గ్రామస్తులు నాగయ్య, సుధాకర్, రామచంద్రయ్య, బాలయ్య, మల్లేశ్, దొర వెంకటయ్య, సమ్మయ్య, యాదగిరి, నగేశ్, లచ్చం, లింగయ్య, కాంతారావు, రాంబాబు, సదానందం, యాదగిరి పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో పైపు బాత్..!

- బాత్ రూంలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- పైపు రంధ్రాల కింద స్నానాలు


రంధ్రాలు చేసిన పైపు కింద స్నానం చేస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం, నవంబర్ 17 : పిల్లలు సరదాగా స్నానాలు చేస్తున్న దృశ్యాన్ని చూసి ఇది బాతింగ్ ఘాట్ అనుకుంటే పొరపడినట్లే. మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. ఇది సరదా కోసం కాదు.. ఇక్కడ బాత్‌రూంలు లేకపోవడంతో ఇలా చేస్తున్నారు. ఒక పైపునకు నలు దిక్కులా రంధ్రాలు చేసి వదిలేశారు. దీంతో మోటార్ ఆన్ చేయగానే నీళ్లు ఆ పైపులోకి చేరి రంధ్రాల నుంచి కింద పడుతున్నాయి. వీటి కింద విద్యార్థులు స్నానాలు చేస్తున్నారు. ఇక్కడే దుస్తులు కూడా ఉతికేసుకుంటున్నారు. పాఠశాలలో సుమారు 400 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. కానీ, వీరికి సరైన స్నానపు గదులు లేకపోవడంతో ఇలా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి పాఠశాలలో ఇదే దుస్థితి నెలకొంది. ఐటీడీఏకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆశ్రమ పాఠశాలలో అధికారులు ఏ మేరకు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారో దీన్ని చూస్తే అర్థమవుతుంది.

## నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**

గణపురం, నవంబర్ 17 : నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఆదివారం గణపురం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మాయిశ్చర్ మీటర్ ద్వారా తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్నే తీసుకురావాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలేకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఓద్దులపల్లె, మైలారం గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేశ్, పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్, సీఈవో సురేశ్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

**మంగపేట మండలంలో..**

మంగపేట : మండలంలోని కమలాపురం, నర్సాపురం(బోరు) శివార్లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్సై సురేశ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కృష్ణ కాలనీ, నవంబర్ 17 : గణపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల కోసం లోకల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం జిల్లా చైర్‌పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వైద్య శిబిరం వద్ద జంపన్నతో రాకేశ్‌రెడ్డి

## వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

ములుగురూరల్, నవంబర్17 : ఏజెన్సీ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జంపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రాకేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని ఉచిత కంటి శిబిరాలను ఏర్పాటు చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. జంపన్న మాట్లాడుతూ 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 120 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశామని తెలిపారు. వారికి జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేయించనున్నట్లు వివరించారు.

## వివాహ విందుకు హాజరైన నాగజ్యోతి


ఎస్సైకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాగజ్యోతి

తాడ్వాయి, నవంబర్17 : మండలంలోని మేడారంలో జరిగిన ఏటూర్‌నాగారం ఎస్సై తాజొద్దీన్ వివాహ వేడుకకు బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి హాజరయ్యారు. మంచిర్యాల జిల్లా కాగజ్‌నగర్‌లో ఈ నెల 14న వివాహం జరుగగా మేడారంలోని హరిత హోటల్‌లో ఆదివారం విందు నిర్వహించారు. కుటుంబ సమేతంగా హాజరైన నాగజ్యోతి ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు రఫీక్, జగదీశ్ తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి నాగుర్ల పరామర్శ

మొగుళ్లపల్లి, నవంబర్ 17: మండలంలోని గణేశ్‌పల్లె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగలగాని వీరేశం, గోపాల్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట చిట్యాల మండల మార్కెట్ మాజీ చైర్మన్ కోడారి రమేశ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, జూపాక భాస్కర్ ఉన్నారు.

**పాపయ్యపల్లిలో బీఆర్ఎస్ నాయకులు..**

గణపురం : మండలంలోని చెల్పూర్ పంచాయతీ పరిధి పాపయ్యపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్ దొగ్గెల చిరంజీవి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని చెల్పూర్ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, మాజీ ఎంపీటీసీలు చెన్నూరి రమాదేవీ మధుకర్, దాసరి రవీందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పిన్నింటి మాధవరావు, కోలా రవీందర్, సొసైటీ డైరెక్టర్ బల్గూరి బాబురావు, బీరెల్లి రాజు, దొడ్డి బాబు, నవీన్ పరామర్శించారు. మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూత

కాటారం, నవంబర్ 17 : పోలీసుల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పలు అసోసియేషన్లు, రాజకీయ నాయకులు, సంస్థల బాధ్యులు భారీ ఎత్తున చేయూతనందించారు. ఆదివారం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రూ.50వేలు, ఎలక్ట్రానిక్స్, హోంనీడ్స్ సంఘం నాయకులు రూ. 51వేలు, కాంగ్రెస్ నేత కొట్టె శ్రీహరి రూ.10వేల చెక్కును ఎస్సై అభినవ్‌కు అందజేశారు. ఓ కమిటీని ఏర్పాటు చేసి వారి ఆధీనంలో డబ్బులు పెట్టనున్నట్లు ఎస్సై తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అన్ని సంఘాల సభ్యులతో సమావేశం ఉంటుందని తెలిపారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తాడ్వాయి, నవంబర్17 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కేఎస్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ కోలా సందీప్, ఏటూరనాగారం బ్లాక్ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య సూచించారు. మండలంలోని మేడారం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ క్రీడలతో భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చైర్మన్ సందీప్ మాట్లాడుతూ తన తండ్రి కోలా సైదులు కోరిక మేరకు మారుమూల ప్రాంతాల విద్యార్థులకు క్రీడా వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

## 'ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలి'

వెంకటాపురం(నూగూరు), నవంబర్17 : ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలని గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. ఆదివారం మండలంలోని దానవాయిపేట గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మా ఊరు మా రాజ్యం అనే నినాదంలో ఆదివాసీలకు ప్రత్యేక స్వయం పాలన ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీసా చట్టాన్ని అమలు చేయకుండా రాజకీయ పార్టీలు అడ్డు పడుతున్నాయని ఆరోపించారు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న భూ భాగాన్ని కలిపి ప్రత్యేక స్వయం పాలన ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో చేలె పవణ రాజు, అట్టం లక్ష్మయ్య పాల్గొన్నారు.